కల్యాణ వైభోగమే..!



ఇస్కాన్‌లో సీతారాముల ప్రత్యేక అలంకరణ



వనికుంటలో పీటలపై కూర్చొని కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు



గణపవరంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



లింగారావుపాలెం రామాలయంలో కల్యాణ పూజలు చేస్తున్న దృశ్యం

- వాడవాడలా కనుల పండువగా సీతా రాముల కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన రామా లయాలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాలతో పాటు అపార్ట్‌మెంట్‌లు, కూడళ్లలో వేసిన చలువ పందిర్లలో రాములోరి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా అందించారు. సత్తెనపల్లి రోడ్డులోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త వేముల శంకరనారాయణ ఆధ్వర్యంలో 108మంది దంపతులకు పట్టు వస్త్రాలను బహూకరించి నిర్వహించిన కల్యాణోత్సంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులు పాల్గొని తలంబ్రాలు పోసి పూజలు జరిపారు. డీఎస్పీ వర్మ కల్యాణంలో పాల్గొన్నారు. అలాగే పట్టాభిరామ స్వామి ఆలయం, సీతారామస్వామి ఆలయం, అరండల్‌పేటలోని రామాలయం తదితర ఆలయాలలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. బరంపేటలోని రాధాగోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ సమేత సీతారామ లక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. రాధగోవిందుల మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, వాల్మీకి రామాయణ గ్రంథాలతో అలంకరణ, శ్రీమద్రామాయణం ప్రత్యేక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు, ఇర్లపాడు, కొత్తలూరు, గుర్రంవారిపాలెం, కనమర్లపూడి, వయ్యకల్లు, గుంటుపాలెం, మతుకుమల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా సీతారామ కల్యాణ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. శావల్యాపురం కోదండ రామస్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలు దంపతులచే వైభవంగా నిర్వహించారు. 2వేలమందికి అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శావల్యాపురంలో గ్రంథాలయ వీధిలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగించారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం

చిలకలూరిపేట: శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామాలయాలతో పాటూ ఆంజనేయస్వామి దేవస్థానాలు కూడా విద్యుత్ దీపాల శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని చలివేంద్రంబజార్, గ్రంథాలయం బజారు, మార్కెట్ సెంటర్, పొట్టి శ్రీరాములు వీధి, తవ్వా బాపనయ్య వీధి, రెడ్ల బజార్, మద్దిమల్లయ్యవీధి, మార్కండేయనగర్ తదితర చోట్ల తాటాకు చలువ పందిళ్లు వేసి, మామిడి తోరణాలు అలంకరించి ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రాచ్ఛారణ నడుమ సీతారాములకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు రామాలయాల్లో పార్టీ నాయకులతో కలసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణంతో పాటు పలు జంటలు వివాహ వేదికపై ఆశీనులై ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవమి వేడుకలు పట్టణంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.

ఈపూరులో...

ఈపూరు: శ్రీరామనవమి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే సీతారామచంద్రస్వామి అందంగా అలంకరించి దంపతులు పీటల మీద కూర్చొని స్వామివారికి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): శ్రీరామనవమి పండుగ వేడుకలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 9వ వార్డు లాయర్‌స్ట్రీట్‌లోని సీతారామాంజనేయస్వామి వారి దేవస్థానం (అవ్వగారి గుడి) నందు జరిగిన వేడుకల్లో స్వామివారి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి బొల్లా ఆదిలక్ష్మి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. నూజెండ్ల మండలం రెడ్డికొత్తూరు గ్రామంలో జరిగిన సీతారాములు వారి కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు బొల్లా గిరిబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు గిరిబాబును సత్కరించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కోదండ రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. గణపవరంలో గతేడాది రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన రామాలయంలో శ్రీరాముని కళ్యాణం శోభాయమానంగా జరిపారు. ముందుగా స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, మరో 18 మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలతో అలంకరించారు. రాత్రి గణపవరం నాగరాజ భజన సమాజం వారిచే భజన నిర్వహించారు. గురువారం శ్రీరాముల వారికి పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని యడ్లపాడు మండలంలోని బోయపాలెం, తిమ్మాపురం, యడ్లపాడు, లింగారావు పాలెం, గుత్తవారిపాలెం, చంగిజ్ ఖాన్ పేట, జగ్గాపురం, జాలాది తదితర గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్త జంటలు, ఆలయాల ధర్మకర్తలు పీటలపై కూర్చొని కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు వడపప్పు, పానకంతో పాటు అన్న ప్రసాద వినియోగం గావించారు



నరసరావుపేటలో రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు



చిలకలూరిపేట రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న కావటి మనోహర్ నాయుడు



వినుకొండలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఆదిలక్ష్మి, తదితరులు

మద్యం విక్రేత అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార బుధవారం తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 10 మద్యం బాటిళ్ల కలిగి ఉన్న నాగరాజును అరెస్ట్ చేశామన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని అభయాంజనేయ స్వామి తిరునాళ్లను బుధవారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు, పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

నిండుకుండలా సింగరచెరువు

వినుకొండ(నూజెండ్ల): వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోకుండా మున్సిపల్ అధికారులు సాగర్ జలాలతో పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును పూర్తిస్థాయిలో నింపారు. దీంతో సింగరచెరువు నిండు కుండను తలపిస్తుంది. దీంతో రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం ఏర్పడదని అధికారులు చెబుతున్నారు. గతంలో 60 ఎకరాలకే పరిమితమైన సింగరచెరువును 270 ఎకరాలకు విస్తరించి స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అభివృద్ధి చేయడంతో నేడు నీటి నిల్వలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. పట్టణానికి మంచినీరు సరఫరా చేసే చెరువులకు సాగర్ జలాలు చేరుతున్న నేపథ్యంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి మంచినీటి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు పట్టణంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక అనుమతితో సాగర్ జలాలు విడదల చేయించడం జరిగిందన్నారు. చెరువులకు సాగర్ జలాలు విడుదల కానున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెరువువద్దకు వచ్చి సెల్ఫీ చాలెంజ్ చేయడం ఆయన కుటిల రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రత్తిపాటి మంత్రిగా ఉన్న సమయంలో ఆయన నిర్లక్ష్య వైఖరి కారణంగా ఒక ఏడాది వేసవిలో రెండు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, షేక్ మీరాబి, చింతపల్లి విల్సన్, కోట్యానాయక్, చెంబేటి భారతి, షేక్ యూసుఫ్ ఆలి, షేక్ మస్తాన్‌వలి, నాయకులు ఏపీఎం సుభాని, విడదల కమలేంద్ర, ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొల్లా కుటుంబ సభ్యుల ప్రచారం



వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులు పట్టణంలోని 9,10, 17, 19, 20 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డుల్లోని ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండకు చేసిన అభివృద్ధిని కరపత్రాల రూపంలో అందజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమార్తె మణికుమారి, అల్లుడు గంగాధరరావు, కోడలు స్వప్న, మనుమరాలు శ్రీతన్యలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థకు చెక్‌పెట్టిన జగనన్న

- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



మహిళను పలకరించి ఓటు అభ్యర్థిస్తున్న కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చెక్‌పెట్టి ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని 18వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. వార్డులోకి వచ్చిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంతో ఆయనతో పాటు ఇంటింటి ప్రచారంలో భాగస్వాములయ్యారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వార్డులో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు చెల్లుచీటీ పలికి పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నారని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. కుట్రలు, కుయుక్తులు, కుతంత్రాలకు నెలవైన టీడీపీ దాని మిత్రపక్షాలు బీజేపీ, జనసేనతో పాటు ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. దేశం మొత్తం మీద ఇంత భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. పేదలకు పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధంలో పేదల సంక్షేమాన్ని ఆకాంక్షించే వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ షేక్ నాయబ్ సైదాబీ, సాపా సైదావలి, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, కౌన్సిలర్లు షేక్ మీరాబి, షేక్ యూసుఫ్‌ఆలి, నాయకులు బండారు దాసు, బక్షు మేస్త్రి, కొచ్చెర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.